క్లుప్తంగా

నేటి నుంచి వికలాంగ పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు

చెరుకుపల్లి: మండలంలో 1,607 మంది వికలాంగ పింఛన్లు పొందుతున్నారని వారికి మరోమారు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 863 మంది శారీరక అంగవైకల్యం, 117 మంది కంటి చూపు లోపం, 297 మంది వినికిడి లోపం, ఇతర రుగ్మతలు కలిగిన వారు 330 మంది నెలకు రూ.6 వేలు వికలాంగ పింఛన్ పొందుతున్నారన్నారు. వీరికి 12వ తేదీ బుధవారం నుంచి కంటి చూపు లోపం ఉన్నవారికి బాపట్ల ఏరియా హాస్పిటల్‌లో, వినికిడి లోపం ఉన్న వారికి తెనాలి ఏరియా హాస్పిటల్‌లో రోజుకు 25 మంది చొప్పున మరోమారు వైద్య పరీక్ష జరుగుతుందని, ఇప్పటికే సచివాలయ సిబ్బంది ఏ రోజు ఎక్కడ వైద్య పరీక్షలకు వెళ్లేది వారికి నోటీసులు అందించటం జరిగిందన్నారు. వీరిని సచివాలయ సంక్షేమ సహాయకులు తీసుకువెళ్లాలని ఎంపీడీఓ ఆదేశించారు.

ధర్మ నిధి సేకరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

పొన్నపల్లి సత్యన్నారాయణ



చెరుకుపల్లి: ధర్మ నిధి సేకరణకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ నిధి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు రూ.1512 ధర్మరక్ష పొన్నపల్లి సత్యన్నారాయణకు అందజేశారు. సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా నలుమూలల ప్రచారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రేపల్లె సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ల



రేపల్లె రూరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత బూరుగలమ్మ అమ్మవారి తిరునాళ్ల, 13వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలకు విచ్చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో భారీ గేట్లు ఏర్పాటు చేయటంతో పాటు కొబ్బరికాయలు కొట్టేందుకు, పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. 12వ తేదీ బుధవారం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అఖండ దీప స్థాపన, పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకం, సద్ది నైవేద్యాల సమర్పణ, గ్రామోత్సవం, 13వ తేదీ గురువారం సహస్ర నామ కుంకుమార్చన, సద్ది నైవేద్యాల సమర్పణ, సాయంత్రం ఆలయ ఆవరణలో కూచిపూడి నృత్య ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించబడునని ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ తెలిపారు.

మోపర్రులో పొలం పిలుస్తోంది



అమర్తలూరు(వేమూరు): ఆపరాలు పెసర, మినుము పైరులో తెల్ల దోమ ఉధృతి ఎక్కువగా ఉందని, మినుము పైరులో ఎల్లోమొజాయిక్ వైరస్ వ్యాప్తి చెందుతుందని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్ల దోమ నివారణకు పైడ్ ఎకరానికి 100 గ్రాములు, ఆర్తీన్ ఎకరానికి 320 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. పైరు 40 నుంచి 50 రోజుల దశలో గమనించి సస్య రక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. రైతులు సేవా కేంద్రంలో పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం ఇవ్వాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. పట్టించుకోని అధికారులు

- రోడ్లు వేయాలని కోరుతున్న గ్రామస్తులు
- రాళ్లపై నడవటం కష్టంగా ఉందని ఆవేదన



వేమూరు నుంచి చావలి వెళ్లు రోడ్డు



తెనాలి నుంచి పెదగాదెవర్రు గ్రామం వెళ్లు రోడ్డు

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రోడ్లు పూర్తి చేస్తామని చెప్పారు. ఆరు నెలలు కాదు కదా 8 నెలలు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంతలను మాత్రమే సరి చేశారు. గుంతల్లో రాళ్లు వేయడంతో రాళ్లపై నడవడం కష్టంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో ఆర్ అండ్ బీ, జిల్లా పరిషత్ రోడ్లు చాల అధ్వానంగా ఉన్నాయి. రోడ్లపై నడవటానికి కూడా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. చుండూరు మండలంలో రెడ్డి సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటం వల్ల కూటమి ప్రభుత్వం ఆ మండలం పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి నుంచి చినపరిమి, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు గ్రామం వరకు రోడ్లు వేయక పోవడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చుండూరు మండలంలో రోడ్లు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు వేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లకు మోక్షం ఎపుడు



చుండూరు మండలంలోని రోడ్లు చాల అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటికీ రోడ్ల గురించి పట్టించుకోలేదు. ఈ రోడ్లకు మోక్షం ఉంటుందా అని ప్రజలు అంటున్నారు.

– తమ్మా బసివిరెడ్డి, చినపరిమి, చుండూరు

రోడ్లపై నడవటం చాల కష్టంగా ఉంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు రోడ్లపై నడవటం కూడా చాలా కష్టంగా ఉంది, ప్రభుత్వం రోడ్లు వెంటనే వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంలో గుంతలు మాత్రమే సరి చేశారు. రాళ్లపై నడవటం కష్టంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అమర్తలూరు వెంకయ్య, అమర్తలూరు

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో అనర్థాలు

సీఐ మల్లికార్జునరావు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం ప్రమాదాలకు స్వాగతం పలికినట్లేనని పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో కలిగే అనర్థాలపై మంగళవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయం ఆవరణలో వాహన చోదకులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడే సమయంలో వాహన చోదకులు డ్రైవింగ్‌పై ఏకాగ్రతను కోల్పోవటం జరుగుతుందన్నారు. ఒకోమారు ఉద్రేకపూరితమైన మాటలు మాట్లాడేందుకు ఆస్కారం ఉంటుందని, అటువంటి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. తమతో పాటు ఎదురుగా వచ్చే వాహన చోదకులను సైతం ప్రమాదాలకు గురిచేసిన వారవుతారని పేర్కొన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, ఒకవేళ మాట్లాడాల్సిన అవసరం ఉంటే రహదారికి పక్కగా వాహనం నిలుపుకుని మాట్లాడాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేవిధంగా హెల్మెట్ వినియోగంపై కలిగే లాభాలతో పాటు హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తే కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను వేరువేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలి

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



ప్రజలకు బుట్టలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: ప్రజలు చెత్తను వేరువేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. తడి, పొడి చెత్తలు, హానికరమైన వ్యర్థాలను వేసుకునేందుకు ప్రతి ఇంటిలో మూడు రకాలైన బుట్టలను ఉపయోగించాలని కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రజలకు బుట్టల పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర' ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రజలు ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులకు అందించే చెత్తను తడి, పొడి, హానికర వ్యర్థాలుగా వేరు చేసి అందించాలని సూచించారు. వాటిని అందించేందుకు సౌలభ్యంగా పురపాలక సంఘం బుట్టలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ద్వారా ఆదర్శ వార్డుగా వివేకానంద కాలనీను ఎంపిక చేశామన్నారు. అనంతరం మాట్లాడుతూ హోమ్ కంపోస్ట్ విధానం, ఇతర పారిశుద్ధ్య అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్.కరుణ, డి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, మెప్మా సీఎంఎం సుబ్రహ్మణ్యం, వివేకానంద కాలనీ సొసైటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

స్టెమి గుండె భరోసాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకరరావు



వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ సుధాకరరావు, వైద్యులు

రేపల్లె రూరల్: గుండె నొప్పితో ప్రాణాలు కోల్పోరాదన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన స్టెమి గుండెకు భరోసా కార్యక్రమాన్ని తీరంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకరరావు కోరారు. ప్రభుత్వ వైద్యశాలలోని సమావేశ మందిరంలో మంగళవారం స్టెమి గుండెకు భరోసా వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. గుండెపోటుకు గురైన వారికి మొదటి గంటలోపు టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ అందించాల్సి ఉంటుందన్నారు. ఆ ఇంజెక్షన్ అత్యంత ఖరీదైనది కావటంతో పేదలకు భారమవుతోందన్నారు. పేదలకు అందుబాటులోకి రావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులోకి తెచ్చాయన్నారు. ఒక్కొక్క ఇంజెక్షన్ రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాల పరిధిలో 28 మందికి ఈ ఇంజెక్షన్ అందించామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధిక ఇంజెక్షన్‌లు అందించిన జాబితాలో రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ప్రథమ స్థానంలో ఉందన్నారు. గుండె నొప్పిని గ్యాస్ నొప్పిగా భావించి అశ్రద్ధ చేయరాదన్నారు. సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి సరైన చికిత్స పొందాలన్నారు. ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగటం, ఆకస్మికంగా ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవటం వంటివి గుండెపోటు లక్షణాలని వివరించారు. ఈ లక్షణాలు కనిపించిన మొదటి గంటలోపు తగు చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదన్నారు. గుండె జబ్బులను దూరం చేసుకోవాలంటే ఆహారపు అలవాట్లను మార్చుకోవటంతో పాటు ప్రతినిత్యం 40 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు పృథ్వి గణేష్, చైతన్య, స్వప్న, కీర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపుకు కృషి చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్‌ల సమస్యలపై శాసన మండలిలో గళం విప్పే లక్ష్మణరావును గెలిపించుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎమ్మెల్సీగా పోరాటాలు చేసి అనేక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు అయ్యారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, ప్రజా సంఘాల నాయకులు కె.ఆశీర్వాదం, వై.నవీన్, జె.ధర్మరాజు, బి.అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మార్జిన్‌ల ఆక్రమణలు తొలగింపు

- స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లె రూరల్: స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ రేపల్లె కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రహదారి మార్జిన్‌లలో ఉన్న ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. రహదారి మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవటం వల్ల రహదారులు కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య అధికమవుతోందన్నారు. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దటంలో భాగంగా ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారికి 10 రోజుల క్రితమే నోటీసులు జారీ చేశామన్నారు. తొలివిడతగా అరవపల్లి రోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకుని సహకరించాలన్నారు. లేని పక్షంలో దుకాణాలతో పాటు వాటిలోని సామగ్రిని తొలగిస్తామని హెచ్చరించారు. రెండవ విడతలో బస్టాండ్ సెంటర్ నుంచి ఇసుకపల్లి సెంటర్ వరకు ఉన్న ఆక్రమణలు తొలగిస్తామని, పది రోజుల్లో ఆక్రమణలు మొత్తం తొలగింపు కార్యక్రమం పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన ఫార్మసీ విద్యార్థులు



బాపట్ల: బాపట్ల ఫార్మసీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు టి.ఇ.గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఒంగోలు క్విజ్ కళాశాల నిర్వహించిన క్రీడా పోటీల్లో బాపట్ల కళాశాలకు చెందిన కె.వినయ్ ఫొటోగ్రఫీలో ప్రథమ, లాంగ్ జంప్‌లో ఏ పవిత్ర ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన వారిలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు ఉన్నారు.

మాజీ సర్పంచ్ సుందరారెడ్డి మృతి

కర్లపాలెం: మండల పరిధిలోని పాతనందాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ రావి సుందరారెడ్డి(78) అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సుందరారెడ్డి మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి నిజాంపట్నం మండలం గోకర్ణమఠం గ్రామంలోని అతని స్వగృహానికి తరలించారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం పంచాయతీ నుంచి పాతనందాయపాలెం పంచాయతీ సరేట్‌గా ఏర్పడిన తరువాత రావి సుందరారెడ్డి పాతనందాయపాలెం గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సుందరారెడ్డి భౌతికకాయాన్ని బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన రెడ్డి, బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణను అలవరచాలి

సర్వశిక్ష అభియాన్ ఎన్యూమరేటర్ ధనుంజయ్



మాట్లాడుతున్న ఎన్యూమరేటర్ ధనుంజయ్

నిజాంపట్నం: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అలవరచటంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని సర్వశిక్ష అభియాన్ ఎన్యూమరేటర్ ధనుంజయ్ చెప్పారు. మండల కేంద్రమైన నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధనతో పాటు విలువలు నేర్పించాలన్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభ చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల ప్రహరీ గోడ ఎత్తుపెంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివన్నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

సీఐ ఆర్. రాంబాబు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

బాపట్ల: విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సీఐ ఆర్.రాంబాబు పేర్కొన్నారు. డాక్టర్ ఎన్.టి.ఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ ఆధ్వర్యంలో కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐ రాంబాబు మాట్లాడుతూ ర్యాగింగ్ వలన మిగిలిన విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని సూచించారు. ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో వ్యయప్రయాసలతో తమ బిడ్డలు ఉన్నత స్థితికి చేరుకుంటారని చదివిస్తున్నారని, ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌పై కేసు నమోదైతే భవిష్యత్‌లో ఎటువంటి ఉద్యోగం రాదని చెప్పారు. స్నేహపూర్వకమైన విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, బల ప్రయోగం, దాడులు చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం, మహిళలను అనుసరించడం వంటి వాటికి విద్యార్థులు పూర్తిగా దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులకు ఏదైనా ఆపద ఉన్నట్లయితే, వెంటనే పోలీసులకు తెలియజేయాలని, కావాలంటే సాధారణ దుస్తులలో వచ్చి కౌన్సెలింగ్ ఇస్తామని అన్నారు. అలాగే ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా ఉన్నాయని, అనవసరపు యాప్స్ నుంచి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ఎ.అరుణకుమారి, డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, నూకరత్నం, వై.ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు



రైతుల వివరాలు నమోదు చేస్తున్న మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు

రేపల్లె రూరల్: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే తమ వివరాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) కార్యక్రమాన్ని మండలంలోని బేతపూడి గ్రామ వ్యవసాయ సేవా కేంద్రంలో మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ కార్డు తరహాలో అందిస్తుందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీ, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంటల రుణాలు, వివిధ రకాల వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల సేవలు పొందవచ్చని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకం గానీ, 1బీ, ఆధార్‌కార్డు, ఆధార్ నంబరుతో అనుసంధానమైన మొబైల్ ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

ఏఓ మహేష్‌బాబు



పొన్నపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు

చెరుకుపల్లి: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 14 అంకెల గుర్తింపు సంఖ్యను అందిస్తాయని అందుకు రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎ.మహేష్‌బాబు సూచించారు. మంగళవారం మండలంలోని పొన్నపల్లి, నడింపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి రైతు ఆయా గ్రామాల్లో వ్యవసాయ సహాయకులను కలసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకుంటే రైతులు వివిధ ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. అదే విధంగా రెండవ పంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ పి.నాగలక్ష్మీ, ఏఈఓ ఎం.తిరుపతమ్మ, రైతులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

–డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ



బాపట్ల: అన్ని దానాల్లో రక్తదానం మిన్న అని బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది కార్మికులు రక్తదానం చేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించటంతో ప్రాణం నిలబడుతుందని తెలిపారు. రక్తదాన శిబిరానికి సహకరించిన బాపట్ల ఏరియా వైద్యశాల డాక్టరు కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన కార్మికులకు పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి పి.నాగేశ్వరరావు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.